క్లుప్తంగా

చదరంగంతో మేధో వికాసం

ఉప్పునుంతల: చదరంగం ఆటతో విద్యార్థుల్లో మేధస్సు పెరుగుతుందని స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు వెంకటేష్, చందన, సంగీత అన్నారు. శుక్రవారం పాఠశాలలో ఉపాధ్యాయులు చదరంగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇటీవల పాలమూరు ఎన్‌ఆర్‌ఐ ఫోరం సభ్యులు చదరంగం బోర్డులు అందించారు. విద్యార్థులకు ఆట నియమాలను వివరించారు.

ఎమ్మెల్యేకు వినతి

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లిలో నెలకొన్న సమస్యలపై శుక్రవారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు సీపీఎం మండల కన్వీనర్ చింతల నాగరాజు వినతి పత్రం అందించారు. గ్రామ సమీపంలోని చీకటి వాగుపై వంతెన నిర్మాణం, అదేవిధంగా గ్రామంలో ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. గ్రామంలో ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని, పశువైద్య శాల ఏర్పాటు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

వాల్‌పోస్టర్ విడుదల

తిమ్మాజీపేట: వచ్చే నెల సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే ఉపాధ్యాయుల మహా ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ పీఆర్టీయూ మండల అధ్యక్షుడు రమేష్ పవార్ కోరారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మహా ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఉపాధ్యాయులతో కలిసి ఆయన విడుదల చేశారు. ప్రధాన కార్యదర్శి యాదయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్రెడ్డి, సామ్సన్, అమరసింహారెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, యాదయ్య, పరాందాములు, సింహ్మయ్య, సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల నిరసన

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై ఉన్న జూనియర్ కళాశాల పక్కన ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట ఉన్న రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో శుక్రవారం సీపీఎం మండల కార్యదర్శి రామయ్యతో పాటు నాయకులు బురదలో నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి పరిశీలించి రోడ్డు మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సురేష్ సుభాష్, శివ, సుధాకర్, మురళి ప్రేమ్, మహేష్, శివకుమార్ వీరేంద్ర పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక

కందనూలు: జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం 64వ శుభ్రత్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో అండర్ -17 బాలుర విభాగంలో లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. ఈ నెల 25, 26 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ పాల్గొననున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాతిమారెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో ఫాదర్ జగదీష్, పీఈటీ రామన్‌గౌడ్ అభినందించారు.

సమావేశాలను విజయవంతం చేయాలి



అచ్చంపేట రూరల్: ఈ నెల 25, 26 తేదీలలో కొల్లాపూర్‌లో నిర్వహించే ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్ కోరారు. శుక్రవారం అచ్చంపేటలో ఎస్‌ఎఫ్‌ఐ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీజాన్ భట్టాచార్య హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్, తారాసింగ్, సాయి, సతీష్, రాజు, విజయ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వివరాలు నమోదు చేసుకోవాలి

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని వివిధ గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న వినాయక మండపాల నిర్వాహకులు ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలు తప్పకుండ నమోదు చేసుకోవాలని అమ్రాబాద్ ఎస్‌ఐ గిరి మనోహర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేస్తూ 27వ తేదీ వినాయక చవితి సందర్భంగా విగ్రహాలను ఏర్పాటు చే సే ఉత్సవ కమిటీలు htt ps://policeeportal.tspolice.gov.in ద్వార ఆన్‌లైన్‌లో దరకాస్తు చేసుకోవడంతో పాటూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గ్రామాలలో డీజే సౌండ్‌లకు అనుమతులు లేవన్నారు. అదేవిధంగా నిబంధలను తూచా తప్పకుండ పాటిస్తూ రోజు వారి కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. నిమజ్జనం నిర్వహించే రోజు సమయం కూడా తెలియజేయాల్సి ఉంటుందన్నారు.

తెలకపల్లి: నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నరేష్ అన్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా నిర్వాహకులకు సన్నాహక సమావేశం నిర్వహించారు. వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలని కోరారు.

ముమ్మరంగా పనుల జాతర

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉపాధి హామీ పనుల జాతర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్‌లో ప్రజా ప్రతినిధులు మురుగుకాల్వను శుభ్రం చేశారు. చారకొండతో పాటు మండలంలోని జూపల్లి, సిర్సనగండ్ల, తుర్కలపల్లి, చంద్రాయన్‌పల్లి, గోకారం, తదితర గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి పనులు, గ్రామాల్లో కమ్యూనిటీ సంబంధిత అభివృద్ధి పనులు, కూలీలకు పనిదినాలు తదితర వాటిపై చర్చించారు. కోడేరు గ్రామ పంచాయతీ వద్ద ప్రత్యేక అధికారి ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన నూతన పనులపై గ్రామసభ నిర్వహించారు. పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరంలో ఇంకుడు గుంతల పనులను సెక్రెటరీ రాఘవేంద్ర ప్రారంభించారు. లింగాల ఏర్పాటు చేసిన గ్రామసభలో ఉపాధి హామీలో చేపట్టవలసిన పనులపై ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ ఇమాంఅలీ అవగాహన కల్పించారు. తాడూరు మండల కేంద్రంలోని కస్తుర్బా పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణానికి ఎంపీడీఓ ఆంజనేయులు భూమి పూజ చేశారు.



తాడూరులో ఇంకుడు గుంతలకు భూమి పూజ చేస్తున్న అధికారులు



నాగర్‌కర్నూల్ నాగపెద్దముద్దునూరులో



పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరంలో



లింగాలలో..

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ఉప్పునుంతల: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని దాసర్లపల్లిలో ఈజీఎస్ నిధులు రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పనులకు ఎమ్మెల్యే శిలాఫలకాన్ని ఆవిష్కరించి భూమి పూజ చేశారు. అదేవిధంగా మండలంలోని కాంసానిపల్లి. లత్తీపూర్, గువ్వలోనిపల్లి గ్రామాల్లో ఒక్కో గ్రామంలో ఈజీఎస్, ఐసీడీఎస్ నిధులు రూ. 12 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం తదితర పథకాలను అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, మామిళ్లపల్లి ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహరావు, స్థానిక నాయకులు అనంతరెడ్డి, నర్సింహరెడ్డి, ప్రశాంత్ రెడ్డి, అనంతప్రతాప్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, డీఎల్‌పీఓ వెంకటప్రసాద్, ఎంపీడీఓ మోహన్‌లాల్, ఎంపీఓ వెంకటేష్, పీఆర్ డీఈఈ చంద్రకళ, ఏఈలు మహేష్, సాయికృష్ణ, ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి, సూపర్‌వైజర్ బీషా తదితరులు పాల్గొన్నారు.



దాసర్లపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, నాయకులు

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

బల్మూర్: మండలంలోని జినుకుంట, పోలేపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీలు, బల్మూర్‌లోని ఇందిరమ్మ నమూనా ఇల్లు, కేజీబీవీలోని సీసీ రోడ్లను శుక్రవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రారంభించారు. హౌజింగ్ పీడీ సంగప్ప, డీఈ హరినాయక్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ రాఘవులు, నాయకులు , గిరివర్ధన్‌గౌడ్ వెంకట్ రెడ్డి, కాశన్న, మోహన్‌రెడ్డి, నర్సింగ్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు, బీజేపీ నాయకుల అరెస్టు

సాక్షి, నెట్‌వర్క్: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న బీజేపీ నాయకులను, రేషన్ డీలర్లను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కల్వకుర్తి, కోడేరు, తమ్మాజీపేట, వెల్దండ, చారకొండ, లింగాలలో వారిని ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారి సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు. అరెస్ట్ అయిన వారిలో రవీందర్‌రావు, రాజు, పబ్బతి అశోక్, మేడిమాకుల శేఖర్, డీలర్ల సంఘం అధ్యక్షుడు జుంపాల్, మాధవ్, నర్సింహ, వెల్దండ, లింగాల మండలాల బీజేపీ అధ్యక్షులు యాదగిరి, గువ్వని నవీన్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



కోడేరులో అరెస్టు అయిన నాయకులు

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

బిజినేపల్లి: సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధ్యమని పాలెం కేవీకే సమన్వయకర్త డా.పి.శ్రీదేవి పేర్కొన్నారు. శుక్రవారం పాలెం కేవీకేలో రైతుల చర్చాగోష్ఠి-సేంద్రియ వ్యవసాయం, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహార పంటలలో రైతులు వంద శాతం సేంద్రియ ఎరువులనే వినియోగించాలన్నారు. అప్పుడే పోషకాలు పుష్కలంగా ఉంటాయని మనిషి ఆరోగ్యంగా ఉంటాడన్నారు. ఆహార పంటలలో రసాయన ఎరువులు వినియోగించడం వల్ల రసాయనాలు మానవ శరీరంలోకి వెళ్లి అనారోగ్యంబారిన పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మద్రాస్ ఫర్టిలైజర్స్ హైదరాబాద్ రీజినల్ మేనేజర్ వెండి అక్రం, కేవీకే శాస్త్రవేత్త డా.రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డా.పి.శ్రీదేవి

ఆర్టీసీ బస్సుకు ఘన స్వాగతం



తిమ్మాజీపేట: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి 15 ఏళ్ల తర్వాత ఆర్టీసీ బస్సు రావడంతో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి, గ్రామస్తులు, కళాశాల, పాఠశాల అధ్యాపకుల విజ్ఞప్తి మేరకు ఎట్టకేలకు స్పందించిన ఆర్టీసీ అధికారులు శుక్రవారం పోతిరెడ్డిపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించారు. గతంలో నాగర్‌కర్నూల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నాగర్‌కర్నూల్ నుంచి ఐతోల్, భల్లాన్‌పల్లి, పోతిరెడ్డిపల్లి, వెంకాయపల్లి, కోడుపర్తిమిట్ట తదితర గ్రామాల విద్యార్థులు, ప్రజలకు సౌకర్యంగా ఉండేది. గత 15 ఏళ్లుగా బస్సు రాకపోవడంతో విద్యార్థులు, రైతులు ఇబ్బందులు పడ్డారు. బస్సును మామిడి తోరణాలు, పువ్వులతో అలంకరించారు. బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, తిరుపతయ్య, బుచ్చన్న, తిరుపతయ్య, జంగిరెడ్డి, రాములు, హనుమంత్‌రెడ్డి, అశోక్, నిరంజన్, రమేష్, శివ, వాజిద్, తదితరులు పాల్గొన్నారు.

జీవిత బీమా చెక్కు అందజేత



కల్వకుర్తి రూరల్: మండలంలోని ఎల్లికల్ గ్రామానికి చెందిన ముత్యమయ్య (45) ఇటీవల మృతి చెందాడు. రెండు సంవత్సరాల కిందట ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లో సరల్ స్వధన్ ప్లస్ లో రూ.5000 వేలతో పాలసీ తీసుకున్నాడు. ఇటీవల మృతిచెందడంతో రూ.1.50 లక్షలు మంజూరయ్యాయి. దీంతో శుక్రవారం మృతుడి భార్య ఎల్లమ్మకు ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ డివిజనల్ మేనేజర్ దిలీప్ రెడ్డి చెక్కు అందజేశారు. సీనియర్ మేనేజర్ నవీన్ కుమార్, లైఫ్ మిత్ర చంద్రయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలి

పెద్దకొత్తపల్లి: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు పరశురామ్ మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది నీట మునిగిన పంటల వివరాలను సేకరించి రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. తిరుమల్, సుధాకర్‌రావు, వెంకటయ్య, మేకల శివ, శివ పాల్గొన్నారు.

తెగిన కేఎల్‌ఐ పాటు కాల్వ

కోడేరు: మండలంలోని బావాయిపల్లిలో పాటు కాల్వతెగింది. ఊరచెరువులోకి నీరు వచ్చే కాలువ తెగిపోవడంతో దాదాపు 40 ఎకరాలకు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. మాజీ సర్పంచ్ వేణుగోపాల్‌యాదవ్ దృష్టికి రైతులు తీసుకెళ్లగా ఆయన స్పందించి మెగా కంపెనీ అధికారులతో మాట్లాడి జేసీబీ సహాయంతో మరమ్మతులు చేపట్టారు.



అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

తాడూరు: గ్రామ అభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలని ఎంపీఓ నర్సింహులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి ఆంజనేయులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అభివృద్ధికి చేయూతనివ్వాలని కోరారు. ఏఈ శివకుమార్, పవన్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

లింగాల: మండలంలోని అవుసలికుంట ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈఓ బషీర్ అహ్మద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులలో సామర్థ్యాలను పెంచాలని, ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలని ఉపాధ్యాయులకు సూచించారు.

రూ.5.80 లక్షల ఆర్థికసాయం



పెద్దకొత్తపల్లి: ఒట్టిపల్లి గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ మల్లేష్ బ్రెయిన్‌కు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ కోసం డబ్బులు లేకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు సతమవుతున్నారు. విషయం తెలుసుకున్న తోటి ఫొటోగ్రాఫర్లు ఒకరికొకరు చందాలు వేసుకొని మొత్తం రూ.5.80లక్షలను శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో శ్రీశైలం, మల్లేష్, ఆనంద్, కుర్మయ్య, భాస్కర్, సుల్తాన్, గణేష్, శ్రీనివాసులు, ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీమిత్ర రాజు పాల్గొన్నారు.

నిందితులకు జైలుశిక్ష, జరిమానా

నాగర్‌కర్నూల్ క్రైం: మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తులకు జరిమానాతో పాటు జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ శుక్రవారం తెలిపారు. బలాన్‌పల్లికిచెందిన శ్రీశైలం, కుమ్మెరకు చెందిన ఆరీఫ్, లింగాలకు చెందిన అర్జున్‌లు జిల్లా కేంద్రంలోని నెల్లికొండ గేట్ వద్ద పోలీసుల తనిఖీలలో పట్టుబడగా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శృతిదూత ఎదుట హాజరుపర్చారు. శ్రీశైలానికి రూ. 5వేల జరిమానాతో పాటు 20రోజుల జైలు శిక్ష, ఆరీఫ్, అర్జున్‌కు ఒకరోజు జైలుశిక్షతో పాటు రూ. 2వేల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తిమ్మాజీపేట మండలంలో 17 మందికి..

తిమ్మాజీపేట: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 17 మంది డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడగా వారిని శుక్రవారం వారిని కోర్టులో హాజరుపర్చారు. ఒక్కొక్కరికి రూ.1000 నుంచి రూ.2000 వేల వరకు జరిమానాతో పాటు కొన్ని గంటల పాటు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

వివాహిత అదృశ్యం

తిమ్మాజీపేట: మండలంలోని ఆవంచ గ్రామానికి చెందిన వివాహిత(28) అదృశ్యమైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కథనం మేరకు సైదులు మహబూబ్‌నగర్‌లో బోర్‌బండిపై డ్రైవరుగా పని చేస్తున్నాడు. ఈనెల 21 ఇంటి నుంచి విధులకు వెళ్లాడు. అదే రోజు సాయంత్రం వదిన కనిపించడం లేదని సోదరుడు సైదులుకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. దీంతో ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం సైదులు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

వెల్దండ: మండలంలోని బైరాపూర్‌లో రిజర్వాయర్ కోసం నిల్వ ఉంచిన ఇసుకను అక్రమంగా హైదరాబాదులో లారీలో తరలిస్తుంటే గ్రామస్తులు అడ్డుకుని శుక్రవారం పోలీసులకు అప్పగించారు. మూడు రోజుల పాటు ఇసుకను లారీల్లో తరలిస్తుండడంతో అడ్డుకున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు లారీలను స్టేషన్‌కు తరలించారు. పూర్తి విచారణ చేసి కేసులు నమోదు చేస్తామని పోలీసులు పేర్కొన్నారు.

డిండి-నార్లాపూర్ ప్రాజెక్టు పనులను చేపట్టాలి

వెల్దండ/చారకొండ: చిత్తశుద్ధి ఉంటే డిండి-నార్లాపూర్ ప్రాజెక్టు పనులను వెంటనే చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని గోకారం రిజర్వాయర్ పనుల కోసం బైరాపూర్ రెవెన్యూ శివారు పరిధిలో అప్పట్లో ఇసుక, కంకర, తదితర సామాగ్రి ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కాని కొంత మంది నిల్వ ఉన్న ఇసుక డంప్‌ల నుంచి అనుమతులు లేకుండా రాత్రి వేళలో ఇసుకను లారీలతో హైదరాబాదు తరలిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి ప్రాజెక్టు నిర్మించే ఉద్దేశ్యం లేదని అందుకే పట్టించుకోవడం లేదన్నారు. రిజర్వాయర్ పనులు పూర్తి చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గోకారం చెరువులో నీరు నిల్వ ఉండడానికి అవకాశం లేకపోవడంతో గోకారం, చంద్రాయన్‌పల్లి, బైరాపూర్, ఎర్రవల్లి, జేపల్లి రైతుల బోరుబావులో నీరు అడుగంటిపోతోందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో బైరాపూర్-చారకొండ ఆర్‌అండ్‌బీ రోడ్డు బైరాపూర్ సమీపంలోని బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.30కోట్లు నిధులు మంజూరు కావడంతో గతంలో శంకుస్థాపన చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి రద్దు చేసిందని విమర్శించారు. అనంతరం బైరాపూర్ వంతెనను పరిశీలించారు.



బైరాపూర్‌లోని ఇసుక దంపులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

చారకొండ: మండలంలోని చంద్రాయన్‌పల్లిలో ఇటీవల మాడుగుల ముత్తయ్య, ఎర్ర లింగమ్మ, ఎలిమినేటి పద్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ శుక్రవారం గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఒక్కో కుటుంబానికి రూ. 4 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, నాయకులు వెంకటయ్యగౌడు, నిరంజన్, జోగయ్య, దార్లకుమార్, సత్తయ్యగౌడు, పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే గెలుపు

ఉప్పునుంతల: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే గెలుపు ఖాయమని బీఆర్‌ఎస్ అచ్చంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు కొత్త రవీందర్‌రావు అధ్యక్షతన స్థానిక కొత్త యశోద ఫంక్షన్‌హాల్ నిర్వహించిన మండల స్థాయి ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, పేదలను విస్మరించి దుర్మార్గపు పాలన సాగిస్తుందన్నారు. ఇచ్చిన హామీలను ఏమాత్రం అమలుచేయకుండ కాలయాపన చేస్తుందని విమర్శించారు. నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. సీనియర్ నాయకులు పోకల మనోహర్, కట్టా గోపాల్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు తులసీరాం, నర్సింహగౌడ్, స్థానిక పార్టీ నాయకులు శోభన్‌రెడ్డి, బాలునాయక్, భాస్కర్, కృష్ణయ్య, ఎల్లయ్య యాదవ్, సుల్తాన్, భగవంతు, సంతోష్‌రెడ్డి, బాలస్వామి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బాధిత కుటుంబానికి పరామర్శ

తాడూరు: మండలంలోని గుంతకోడూరు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేష్ తల్లి వెంకటమ్మ, అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. బీఆర్‌ఎస్ నాయకులు రాజు, పెద్దవెంకటయ్య, వెంకటేస్, బాలగౌడ్, బొందయ్య, తదితరులు ఉన్నారు.

శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపు

వెల్దండ: మండలంలోని తిమ్మినోనిపల్లిలో శుక్రవారం త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి జ్ఞాన వేదిక అచ్చంపేట ఆధ్వర్యంలో శ్రీకృష్ణ ప్రతిమను ఊరేగించారు. గ్రామం ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. భక్తిగీతాలకు అనుగుణంగా భక్తులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో సాయిశంకర్, వరుణ్, ఆంజనేయులు, వెంకటయ్య, రమాదేవి, స్వప్న, మంజుల, పార్వతమ్మ, గీత తదితరులు ఉన్నారు.


నేడు బ్లాక్ డే

కల్వకుర్తి రూరల్: పాత పెన్షన్ విధానాన్ని తొలగించి నూతన పెన్షన్ విధానం అమలు చేసిన ఆగస్టు 23న బ్లాక్ డేగా పాటిస్తున్నట్లు టీఎస్‌సీపీఎస్ ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి సంవత్సరం 23న బ్లాక్ డేగా సీపీఎస్ ఉద్యోగులు పాటిస్తున్నారన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలని ప్రతి ఉద్యోగి పని చేస్తున్న కార్యాలయంలో, పాఠశాలలో, కళాశాలలో మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలని కోరారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణానికి మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహ్మ శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేందర్, ఏపీఓ వెంకటేష్, పంచాయితీ కార్యదర్శి నాగేశు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్ రావు, సింగిల్ విండో డైరెక్టర్ చంద్రయ్య, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

హెల్త్ కిట్ల పంపిణీ



కల్వకుర్తి రూరల్: మండలంలోని మేడిగడ్డతండాలో శుక్రవారం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 400 మందికి ఆర్గానిక్ హెల్త్ కిట్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ సూచన మేరకు కిట్లు అందజేసినట్లు సభ్యుడు మల్లేష్ తెలిపారు. శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



మన్ననూర్: రాష్ట్రీయ బాల స్వస్తిక్ (ఆర్‌బీఎస్‌కే) కార్యక్రమాల్లో భాగంగా మన్ననూర్‌లోని పీటీజీ బాలుర పాఠశాల/కళాశాలలోని విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 3వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై వైద్యాధికారి మహేశ్వర్ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ పద్మావతి, డాక్టర్ మంగ, ఫార్మసిస్టు రాజు, ఏఎన్‌ఎం ఉసేనమ్మ, రేణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జూపల్లికి సన్మానం

మన్ననూర్: అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు కృష్ణగిరి (ఈగలపెంట)కు వెళ్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావును మార్గమధ్యలో మన్ననూర్‌లోని మృగవాణి రెస్టారెంట్ ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణతో కలిసి ఆయన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తతో కాసేపు ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో ఎలాంటి స్పందన ఉందని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయాల చైర్మన్ రాజేందర్, రహీం, రాజారాం, వెంకటరమణ, సైదులు, కృష్ణయ్య. తిరుపతి, గోపాల్, సుక్యా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రో సేవా కేంద్రాల తనిఖీ



వెల్దండ: మండల కేంద్రంలోని ఆగ్రో సేవా1, 2 కేంద్రాలను శుక్రవారం కల్వకుర్తి టెక్నికల్ ఏఓ మంజుల ఆకస్మిక తనిఖీ చేశారు. ఆగ్రో సేవా కేంద్రాల నుంచి యూరియా ఇతర మండలాలకు సరఫరా చేస్తున్నట్లు వెల్దండ రైతులు డివిజన్ వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. యూరియా తరలించే వాహనాన్ని రైతులు అడ్డుకోవడంతో ఆగ్రో సేవా నిర్వాహకులు తిరిగి దుకాణానికి తరలించారు. జిల్లా అధికారుల సూచనాల మేరకు వ్యవసాయ అధికారులు దుకాణాలను తనిఖీ చేశారు. యూరియా సరఫరాలో అక్రమాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాపుల్లో నిల్వ ఉన్న యూరియాను అధికారులు రైతులకు పంపిణీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓలు సురేష్, దాక్యానాయక్, ఆగ్రో సేవా నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి



బిజినేపల్లి: ఆకతాయిలతో అమ్మాయిలు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని షీ టీం ఏఎస్‌ఐ విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం పాలెం ప్రభుత్వ కళాశాలలో మహిళలు, అమ్మాయిలు వేధింపులు, అఘాయిత్యాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ బాలికల అక్రమ రవాణా, వేధింపులు, బాల్య వివాహాలు, పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా వేధిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం సిబ్బంది సునీత, శ్రీనివాస్‌శర్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సూత్రదారులను గుర్తించాలి

మన్ననూర్: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఉట్టు కొట్టే కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శివాజీ గెలువయ్యను కులం పేరుతో పెట్టి దూషించడం బాధకరమని కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర నాయకుడు ముద్దునూరి లక్ష్మీనారాయణ, జిల్లా నాయకుడు మంతటి పర్వతాలు అన్నారు. శుక్రవారం నిజ నిర్ధారణలో భాగంగా మన్ననూర్‌లోని జంగాల కాలనీలో గెలువయ్యను వారు పరామర్శించి సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర విచారణ చేపట్టి అసలైన సూత్రదారులను గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, ఈదయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.